ఇండోర్ స్టేడియం.. అభివృద్ధికి దూరం

- పై కప్పు కూలి నిరుపయోగంగా ఏలూరు ఇండోర్ స్టేడియం
- పట్టించుకోని ప్రభుత్వం
- వాకర్స్, బాలబాలికల ఆవేదన

ఏలూరు రూరల్: ఏలూరు ఇండోర్ స్టేడియం పేరు చెబితే బాలబాలికలు, సీనియర్ క్రీడాకారుల్లో ఉత్సాహం వెల్లువిరుస్తుంది. కొద్దినెలల క్రితం వరకూ పిల్లలు, పెద్దల ఆటలతో ఇండోర్ స్టేడియం కళకళలాడింది. పదుల సంఖ్యలో బాలబాలికలు బ్యాడ్మింటన్, జూడో క్రీడలో సాధన చేసారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించారు. పతకాలు, మెమెంటోలు పతకాలతో పాటు పేరు, ప్రఖ్యాతలు తెచ్చారు. ఇదంతా ఇప్పుడు గతం. కొద్దినెలల క్రితం ఈ స్టేడియం పైకప్పు కుప్పకూలింది. దీంతో అధికారులు ఇండోర్‌లో ఆటలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఫలితంగా బ్యాడ్మింటన్, జూడో కోర్టులో పిల్లల సాధన బంద్ అయ్యింది. నెలలు గడుస్తున్నా అధికారులు అభివృద్ధిపై దృష్టి సారించడంలేదు. ఇండోర్‌లో సాధన ఎప్పుడు చేద్దామా అని ఆశగా ఎదురుచూసిన పిల్లలు నిరుత్సాహానికి గురవుతున్నారు. కొందరు పిల్లలు ఆటకు ఫుల్‌స్టాప్ పెట్టారు. మరికొందరు ఆరు బయటే సాధన చేస్తున్నారు. ప్రభుత్వం ఇండోర్ స్టేడియం అభివృద్ధిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించిన ఇండోర్ గతేడాది వర్షాలకు తడిసి రాత్రివేళ పైకప్పు కూలిపోయింది. అప్పటి నుంచి ఇందులో పోటీల నిర్వహణ, సాధన నిలిచిపోయాయి. ప్రభుత్వం, అధికారులు స్పందించి కొత్త ఇండోర్ స్టేడియం నిర్మించాలని క్రీడాకారులు, అభిమానులు కోరుతున్నారు.



కుప్పకూలిన ఏలూరు ఇండోర్ స్టేడియంలో పై కప్పు

భవనం పునర్నిర్మించాలి



స్టేడియం పైకప్పు కూలి నెలలు గడుస్తోంది. ఇప్పటి వరకూ ప్రభుత్వం పునర్మించకపోవడం విచారకరం. పిల్లలు ఆటలకు దూరమయ్యారు. ప్రభుత్వం ఆటలకు ప్రాధాన్యత ఇస్తామంటూ ప్రకటించినా పనులు కార్యరూపం దాల్చడం లేదు. ప్రతిరోజూ వాకింగ్ అనంతరం స్టేడియంలోని జిమ్‌లో కొద్దిసేపు సాధన చేసేవాడిని. జిమ్ ఇప్పుడు మూసివేసారు. అధికారులు స్టేడియం పునర్మించాలి.

– సుభాని, వాకర్

స్టేడియంను బాగు చేయాలి



ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడుకోవాలని ఎంతో ఆశగా ఉంటుంది. మా సీనియర్స్ ఇండోర్‌లో ఆడుకుని మంచి ప్లేయర్స్ అయ్యారు. సమీపంలోని స్టేడియంకు వెళ్లి ఆడుకోమని ఇంట్లో అంటున్నారు. కాని స్టేడియం కూలిపోయి ఆడుకోవడానికి ఉపయోగపడటం లేదు. అందుకే ఆదివారం, సెలవు రోజుల్లో మాత్రమే స్నేహితులతో వచ్చి ఆరుబయటే ఆడుకుంటున్నాను. ఇండోర్ స్టేడియంను బాగుచేయాలి.

– పగ్నేష్

బ్యాడ్మింటన్ సాధన చేయాలని ఉంది



నాకు రోజూ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ సాధన చేయాలని ఉంది. మా ఇంటి వద్ద బ్యాడ్మింటన్ ఆడేందుకు ఆట స్థలం లేదు. అందుకే ఆదివారం ఆడుకునేందుకు ఇండోర్ స్టేడియంకు వస్తున్నాను. కానీ ఇక్కడ స్టేడియం మూసేసారు. చాలా మంది ఇండోర్‌లో బ్యాడ్మింటన్ ఆడి మంచి ప్లేయర్స్ అయ్యారు. ఇండోర్ స్టేడియంను బాగు చేయాలి.

– సాత్విక్

మల్టీపర్పస్ ఇండోర్ నిర్మాణం



ఏలూరులో శిథిలమైన ఇండోర్ స్థానంలో కొత్త మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.14 కోట్ల నిధులు మంజూరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే డీపీఆర్ తయారు చేయాలని జిల్లా గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. ఇంజినీర్లు స్థలం పరిశీలించారు. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర ఇండోర్ క్రీడలు సాధన చేయడంతో పాటు పోటీలు నిర్వహించేందుకు అనుకూలంగా నిర్మాణం ఉంటుంది.

– బి.శ్రీనివాస్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

కృష్ణ మాస్టారుకు గురు బ్రహ్మ అవార్డు



గురుబ్రహ్మ అవార్డు అందుకుంటున్న గుగ్గులోతు కృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఇందిరా కాలనీ ఎంపీయూపీ స్కూల్ స్కూల్లో అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గుగ్గులోతు కృష్ణకు విశాఖపట్నానికి చెందిన మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ గురుబ్రహ్మ స్టేట్ అవార్డు ప్రకటించింది. ఈ అవార్డును ఆదివారం ఉదయం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి చేతులమీదుగా ఆయన క్యాంపు కార్యాలయంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ విద్యారంగానికి చేసిన సేవల్లో భాగంగా కృష్ణ మాస్టారుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేసిందని, ఇప్పుడు మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విద్యారంగానికి చేసిన సేవలను గుర్తించి గురుబ్రహ్మ అవార్డును ప్రదానం చేయడం చాలా సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాస్టారుకు పలువురు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు తడికలపూడి విద్యార్థుల ప్రాజెక్టు



విద్యార్థులను, గైడ్ టీచర్లను అభినందిస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 2024–25లో తడికలపూడి విద్యార్థులు రూపొందించిన స్టూడెంట్ అటెండెన్స్ యాప్ అనే వ్యక్తిగత ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైందని ఆ పాఠశాల ప్రతినిధులు ఏలూరులో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం పొందిన సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచర్లుగా వ్యవహరించిన పావని, అన్నపూర్ణను ఆమె అభినందించి ఈ ప్రదర్శన జాతీయ స్థాయికి కూడా ఎంపిక కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

వాసు దేవాలయంలో విశేష అభిషేకాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పవిత్రమైన ధనుర్మాసం నెల పురస్కరించుకొని స్థానిక పవర్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వాసుదేవ స్వామి దేవస్థానంలో ఆదివారం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజల్లో ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కందుకూరి వేంకట విజయ్ కుమార్ విశేష పూజలు నిర్వహించారు.

తాతా సత్యనారాయణ సేవలు ఆదర్శనీయం

దెందులూరు: డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్, సర్పంచిగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తాతా సత్యనారాయణ పార్టీకి అందించిన సేవలు మరువలేనివని, ఆయన క్రమశిక్షణ, పార్టీ పట్ల అంకితభావం నాయకులు, కార్యకర్తలకు ఆదర్శనీయమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం తాత సత్యనారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. పార్టీ ఏలూరు జిల్లా ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు గూడపాటి పవన్‌కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కాటి సుధాకర్, పార్టీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి, తొత్తడి వేదకుమారి, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, జిల్లా కార్యదర్శులు కట్ట ఏసుబాబు, గొల్ల కిరణ్, పులవర్తి సంతోష్, మండల యువజన విభాగం అధ్యక్షుడు గొరిపర్తి శ్రీనివాస్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ, దెందులూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు గొలుసు గణపతిరావు తదితరులు నివాళులర్పించారు.

పాత ప్యాకేజీ పరిహారంగా ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరం

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పాత ప్యాకేజీ ప్రభుత్వం చెల్లించడంపై సీపీఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. స్థానిక పవరుపేటలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుల సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. లింగరాజు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రవి మాట్లాడుతూ పోలవరం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఎప్పుడో నిర్ణయించిన పాత రేట్లను కొన్ని ప్రాంతాల్లో నిర్వాసితులకు ప్రభుత్వం ఇస్తోందని, నిర్వాసితుల అభిప్రాయం తీసుకోకుండా, వారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా బ్యాంకుల్లో ఆ మొత్తాన్ని జమ చేస్తోందని తెలిపారు. ఈ విధంగా ప్రభుత్వ వ్యవహరించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. బ్యాంకు ఖాతాల్లో పాత రేట్లను జమ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది అని వ్యాఖ్యానించారు. 2015లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.6.86 లక్షలుగా ప్యాకేజీని ప్రకటించిందని ఆయన తెలిపారు. 2022లో సీపీఎం, ప్రజల ఆందోళనతో జగన్ ప్రభుత్వం ప్యాకేజీని రూ.10 లక్షలకు పెంచిందన్నారు. 41.75 మీటర్ల వద్ద అశాస్త్రీయంగా నిర్ణయించిన కాంటూరు లెక్కల ప్రకారం కొద్ది గ్రామాలకే పరిహారం ఇవ్వడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. 2021–22 వరదల ప్రాతిపదికగా కాంటూరు లెక్కలను తాజాగా లెక్కలు వేసి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ 2013 భూసేకరణ చట్టం, ఆదివాసీ హక్కుల చట్టాల ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా పరిహారం చెల్లించడంతో పాటు పునరావాసం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ తర్వాతే డ్యామ్ పనులు చేపట్టాలని, ఆ లోగా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. లేని పక్షంలో అన్యాయానికి గురైన నిర్వాసితులను సమీకరించి పోరాటాలకు సిద్ధం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. రాజు, కె.శ్రీనివాస్, పి రామకృష్ణ పాల్గొన్నారు.



సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రవి

శ్రీనివాసరాజుకు అభినందనలు

ఉంగుటూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్ష పదవి చేపట్టిన పాతూరి శ్రీనివాసరాజును పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణపురం మాజీ ఉపసర్పంచి అడపా శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఛాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు, ఉంగుటూరు ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణ, కాగుపాడు వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతల కిషోర్, తాడిగడప వెంకటేశ్వరరావు, పెనుమాక విజయబాబు తదితరులు పాతూరి శ్రీనివాసరాజును ఉంగుటూరులో అభినందించారు.

వైభవంగా సుదర్శన హోమం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తిరిగి సాయంకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 5 గంటలకు కె.శారద భాగవతారిణి ధ్రువ చరిత్ర అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. సాయంత్రం 7 గంటల నుంచి నగరానికి చెందిన వెంకటరాయ నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి నీలి శర్వాణి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, విశేష పూజలు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.



సుదర్శన హోమం ముగింపు సందర్భంగా పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

ఆరోగ్యశ్రీ సేవల నిలుపుదల తగదు

దెందులూరు: ప్రైవేటు నెట్‌వర్క్స్ వైద్యశాలల్లో అందించే ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్యశ్రీతో పాటు ఈ హెచ్ఎస్ సేవలను నిలిపివేస్తామని ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల సమాఖ్య ప్రకటించినప్పటికీ కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని పార్టీ సీనియర్ నేత ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో రూ.3 వేల కోట్ల బకాయిలు ఏపీ స్పెషాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఎన్ని విజ్ఞప్తులు చేసినా కూటమి ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఈ నెల 6 నుంచి ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ సేవలను నిలిపివేస్తున్నట్లు ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల సమాఖ్య ప్రకటించడం ఆందోళన రేకెత్తించే తీవ్రమైన అంశమని అన్నారు. బకాయిలు చెల్లించకుండా వైద్యశాలలు ఎలా వైద్య పరీక్షలు, సేవలు అందిస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల ఆరోగ్యం కూటమి ప్రభుత్వానికి పట్టదా అని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని రాష్ట్రంలో ఉన్న పేద బడుగు బలహీన వర్గాల ప్రజలందరి ఆరోగ్యం భద్రత భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ప్రైవేట్ నెట్వర్క్ వైద్యశాలల యూనియన్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసి పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని వైద్య సేవలకు పరీక్షలకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని పల్లెం ప్రసాద్ డిమాండ్ చేశారు.

ఏలూరులో ముగిసిన చెస్ ఫెస్టివల్



పోటీల్లో విజయం సాధించిన చిన్నారులు

ఏలూరు రూరల్: ఏలూరు శాంతినగర్‌లో ఆదివారం అండర్–15 చెస్ ఫెస్టివల్ నిర్వహించామని అబ్రహం గ్యారీకాస్పారోవ్ చెస్ అకాడమీ డైరెక్టర్ జి యోహనాన్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పిపాల్ వుడ్ గ్లోబుల్ స్కూల్ ఆవరణలో అర్బిటర్లు జి స్వరూప్‌రాణి, పి యదిద్యా పరివేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో జి అభిషేక్ అబ్రహామ్ ప్రథమస్థానం, జి అనురూప్ మోషే రెండోస్థానం, పి హర్షవర్ధన్ మూడోస్థానంలో నిలిచారని వెల్లడించారు. వి.కార్తికేయ, పి.ఉదయ్‌కుమార్ సైతం నాలుగు, ఐదో స్థానం సాధించారని వివరించారు. వీరితో పాటు పి సాత్విక, కె మమిత్‌కుమార్, టి సేవనీత్, బి జస్వంత్, ఎస్‌కే పర్వాన్, బి ధరణి, ఎం అశ్విన్, ఎం బెన్ని, మోక్షిత్, ఆదర్స్ ప్రతిభ చాటారని పేర్కొన్నారు. విజేతలకు స్కూల్ ప్రతినిధులు ఎస్ బలరామ్, ఏఎస్ఎస్ మాధవ్, యలమంచిలి నాగేంద్ర శ్రీనివాస్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారని తెలిపారు.

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే ఇవ్వాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీలో ప్రవేశపెట్టనున్న విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే ఇవ్వాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు డిపో కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో పాటు ఈనెల 7న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్లను ఆదివారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి టీపీఆర్ దొర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 88 ద్వారా 2029 నాటికి 100 శాతం ఆర్టీసీ బస్సులు విద్యుత్ బస్సులుగా మార్చాలని స్పష్టం చేసిందని, రాష్ట్రంలోని 11 ప్రధాన నగరాల్లో 750 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇవి పూర్తిగా ప్రైవేటు బస్సులేనని, వీటిలో పనిచేసే వారంతా ప్రైవేట్ సిబ్బందేనని, విద్యుత్ బస్సుల పేరుతో ఇది ఆర్టీసీని పూర్తిగా ప్రైవేటీకరించడమేనన్నారు. ఇప్పటికే ఆర్టీసీలోని 11,216 బస్సుల్లో 2,751 అద్దె బస్సులు ఉన్నాయని, రానున్న 750 విద్యుత్ బస్సుల వల్ల 3,700 మంది వరకు ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్, కండక్టర్లు మిగులు తేలుతారని, వీరికి ఉద్యోగ భద్రత ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారా నిర్వహిస్తే అందరికీ మేలు జరుగుతుందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, అలా కాకుంటే ప్రైవేట్ విద్యుత్ బస్సుల వల్ల ప్రజలపై చార్జీల భారం పడుతుందన్నారు. ఏలూరు జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్, సంఘ నాయకులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

నిబంధనల పేరుతో కౌలు రుణాలకు ఇబ్బందులు

ఏలూరు (టూటౌన్): రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల ప్రకారం కౌలు రైతులకు రబీ పంట రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అన్నే భవనంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకర్లు నిబంధనల పేరుతో రుణాలు ఇవ్వడం లేదన్నారు. భూ యజమాని పంట రుణం పొందారనే పేరుతో కౌలు రైతుకు మొండిచేయి చూపడం తగదన్నారు. పంట సాగుదారు హక్కు పత్రాలు పొందిన ప్రతి కౌలు రైతుకు రుణాలిచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీలో కౌలు రైతుల పంట రుణాలకు అధిక ప్రాధాన్యమివ్వా లని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా ఆచరణలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన కౌలు చట్టం తీసుకురావా లని కోరారు. రుణాల కోసం కౌలు రైతులు బ్యాంకుల వద్ద ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కో–కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.



ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	25
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు – తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	48	బీన్లచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	44	చామదుంపలు	40
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	32–36	కంద	60
కాకర కాయలు	36–44	బీట్‌రూట్	46
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	50	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	28	అల్లం	70
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	52	పాలకూర	10
బంగాళదుంపలు	30–36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	42	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07
దోసకాయలు	34–40	పుదీనా	05
ఆనబకాయ (1)	25–30	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	36

వికృతంగా... వీధి కుక్కలు

నిడమర్రు: పశువులకు లంపీ స్కిన్ వైరస్ సోకినట్టే.. నిడమర్రు మండలంలోని వీధి కుక్కలు కొత్త రోగంతో బక్కచిక్కిపోతున్నాయి. వాటి శరీరంపై ఉన్న జుట్టురాలి, ఒంటి నిండా పుండ్లు, వాటి నుంచి రక్తం కారుతూ ఆ కుక్కల ఆకారం వికృతంగా మారుతోంది. ఈ వ్యాధి ఒకదాని నుంచి మరొక దానికి వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో వీధుల్లో శునకాలు కనబడితే స్థానికులు భయాందోళనలతో పరుగులు తీస్తున్నారు. మండల కేంద్రం నిడమర్రులో అధిక శాతం వీధి కుక్కలు వ్యాధి బారిన పడ్డాయి. ఇప్పటికే వీధికుక్కల ద్వారా చర్మవ్యాధులు కొన్ని పెంపుడు కుక్కలకు కూడా సోకినట్లు యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాటికి చికిత్స చేయించి యజమానులు దూర ప్రాంతాల్లో వదిలేస్తున్నారు.



నిడమర్రులో వైరస్ సోకిన కుక్క



చర్మ వాధి సోకిన పెంపుడు కుక్క

శునకాల వ్యాధి తీవ్రత గుర్తించాలి

నిడమర్రు పంచాయతీ పరిధిలో అధికశాతం వీధి కుక్కలకు చర్మవ్యాధి సోకింది. పలు ప్రాంతాల్లో గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. వ్యాధి బారిన శునకం తిన్న ఆహారం, తాగిన ద్రవ పదార్థాలను మరో శునకం తీసుకుంటే వాటికి కూడా ఈ వ్యాధి సోకుతున్నట్లు స్థానికులు చెపుతున్నారు. అవి సంచరించే ప్రాంతాల్లో తిరిగితే ఈ వ్యాధి వ్యాపిస్తుందని కొందరు భయపడుతున్నారు. పరిస్థితి విషమించినా పశువైద్యాధికారులు, పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు తప్పు పడుతున్నారు.

మండలంలో 550 వరకూ వీధి కుక్కలు

నిడమర్రు మండలంలో పశు గణాంకాల ప్రకారం 550 వరకూ వీధి కుక్కలు, 150 వరకూ పెంపుడు కుక్కలు ఉన్నట్లు అంచనా. శునకాలకు వచ్చిన చర్మవ్యాధిని తీవ్ర అలర్జీ లేదా డెర్మటైటిస్ అంటారని ప్రైవేటు పశు వైద్యాధికారులు చెపుతున్నారు. తీవ్రత లేని కారణంగా మరింతగా బ్యాక్టీరియా సోకి చివరకు మృత్యువాత పడుతాయని వారంటున్నారు. వీటిలో చాలా కుక్కలు ప్యారాసైట్ ఇన్ఫెస్టేషన్ రోగం బారిన పడినట్లు తెలుస్తోంది. కుక్కలపై ఈ వ్యాధి ప్రభావంతో వాటి శరీరంపై బొచ్చు ఊడిపోయి గజ్జి మాదిరిగా తయారవుతుందని పలువురు చెపుతున్నారు.